సంతోషం వెలుగులా పెల్లుబికేలా చేస్తుంది




విమ్‌ఫిక్స్. వెండిపూతగల యీ గుళికల్లో శిలాజిత్,
కుంకుమపువ్వు, కవచబీజ్, శతావరీ, వంగభస్మం,
రససిందూరం, అశ్వగంధ లాంటి అత్యంత ప్రభావంగల,
పుష్టినిచ్చే, చైతన్యవంతమైన ఆయుర్వేద పదార్థాలున్నాయిఇది.
నిస్సత్తువ, అస్వభావికమైన నీరసం, అలసట, వయస్సు
ముదరకుండా వచ్చే వార్ధక్యం, వీటిని పోగొట్టి పురుషులలో
బలం, శక్తి, నవ చైతన్యం రేకెత్తుతుంది.

విమ్‌ఫిక్స్

శుద్ధత • సామర్థ్యత • విశ్వసనీయత
9 దశాబ్దాల రుజువైన అనుభవం

సాండూ ఔషధాలు

పి. కె. సాండూ బ్రదర్స్ చెంబూర్ ప్ర. లి.
3-3-73/6-7-8 కుతుబిగూడ,
ప్రభాత్ టాకీసు వెనుక,
హైదరాబాద్-500 027.

శరీర స్వాస్థ్యం సేవామహే

AD HOUSE 1126

# పిచ్చిదొంగ

అర్థరాత్రి పన్నెండు గంటలు దాటుతోంది. లంకంత ఇంట్లో ఒక్కతే పడుకున్న ఉషకు భయంగా వుంది. ఉదయమే బంధువుల పెళ్ళికి తల్లీ తండ్రీ హైదరాబాద్ వెళ్ళారు.

కొత్త సినిమా రిలీజయ్యిందని ఫస్ట్ షో కెళ్ళిన అన్నగారు టిక్కెట్టు దొరకక తిరిగి వచ్చి భోజనం చేసి కొంపమునిగినట్టు మళ్ళీ సెకండ్ షోకి వెళ్ళాడు. ఉషకు తెల్లవారితే ఇంగ్లీషు పరీక్ష. చదువుదామంటే నిద్ర వస్తోంది. అదేం కర్మో ఆ నిద్ర కూడా క్లాస్ పుస్తకాలు చదువుతుంటేనే వస్తుంది. అదే ఏ నవలన్నా అయితే వచ్చే నిద్ర కూడా ఎంచక్కా వెనక్కి పోతుంది. ఆలోచిస్తూ పడుకుంది తెల్లవారుజామున లేచి చదవచ్చులే అనుకుని కళ్ళు మూసుకుంది.

వెంటనే పౌరాణిక కథల్లో రాక్షసులు, జానపద కథల్లో దెయ్యాలు, డిటెక్టివ్ కథల్లో దొంగలు ఉష కళ్ళముందు నిలిచి భయ కంపితురాల్ని చేశాయామెను.

గుర్తున్న దేముళ్ళనందరినీ తలచుకుంది. వచ్చినంతవరకు ఆంజనేయ దండకం వల్లించింది. అయినా భయం మాత్రం వదల్లేదు.

ఏ చిన్న చప్పుడైనా సరే దొంగలెవరైనా వచ్చారేమోనని భయంగా వుంది. అన్నగారి మీద చెప్పలేనంత కోపం వచ్చింది. ఈనేళ సినిమాకి పోకపోతే ఏం పోయింది? ఆ పోయేవాడు తనని కూడా తీసుకుపోయి వుంటే ఈ భయం వుండేది కాదు. ఇక్కడ నేను ఒక్కదాన్నే భయంతో ఛస్తుంటే అక్కడ వాడు ఎంచక్కా సంతోషంగా సినిమా చూస్తున్నాడు. నాన్నగారు వచ్చిన తర్వాత వాడి తిక్క వదిలించాలి.

ఉష అలా అనుకుంటుండగానే పెరట్లో ఏదో దబ్బున పడిన చప్పుడైంది! దొంగేమో గోడ దూకి వుండవచ్చు! దొంగ ఊహ రాగానే ఉష వళ్ళంతా భయంతో బిగుసుకుపోయింది. తమ వంటింటి తలుపు గడియ కూడా లూజుగా వుంటుంది. బయటినుంచి కొస్త ప్రయత్నించి తీసేయవచ్చు.

సెకండ్ షోకి వెళ్ళి వచ్చే అన్నగారు తలుపు తీయమంటే ఎక్కడ నాన్నగారు తిడతారోనని ఎన్నిసార్లో అలా బయటినుంచి తీసేసి ఇంట్లోకి వచ్చి తలుపు వేసేవాడు. ఈ దొంగ వెధవ కూడా అలాంటి పనిచేస్తే 'అమ్మో' కళ్ళు గట్టిగా మూసుకుని దుప్పటి నిండుగా కప్పుకుంది. వంట గదిలో ఏదో నల్లటి ఆకారం కదులుతోంది. భయంతో శరీరం బిగుసుకుపోయింది ఉషకు. కళ్ళు మూసుకున్నదే కాని ఆ నల్లటి ఆకారం గదిలోకి వచ్చి దుప్పటి లాగి కత్తి చూపించి బెదిరిస్తుందని మనస్సు పదేపదే చెబుతున్నది.

ఆ నల్లటి ఆకారం ఆమెకు దగ్గరగా వచ్చి దుప్పటి లాగేసింది. కళ్ళు తెరచిన ఉష ఆ బెడ్ లైట్ కాంతిలో ఆ నల్లటి ఆకారాన్ని చూసి కెవ్వున అరవబోయింది.

"ఉష్, అరిచావంటే పీక పిసికేస్తాను జాగ్రత్త! ఆ చెవుల రింగులు, మెడలో గొలుసు ఇచ్చెయ్యి. నిన్నేం చెయ్యను" అన్నదా ఆకారం.

ఉష మెదడులో వెంటనే ఓ ఆలోచన మెరిసింది. రెండు చెవులకు చేతులు అడ్డంగా పెట్టుకుని గట్టిగా ఏడుపు మొదలుపెట్టింది. ఆ ఆకారం చెవుల రింగులు లాక్కోబోయింది.

"గొలుసు తీసుకో కాని రింగులు తీసుకోవద్దు, మొన్న పండక్కి మా నాన్నగారు బంగారు రింగులు చేయించారు. అవి పోతే మళ్ళీ కొనరు, పైగా కొడతారు"



ఏడుపు మరింత పెంచింది ఉష.

"ఆ ఇత్తడి గొలుసు నాకెందుకు? బంగారు రింగులు ఇటివ్వు" అంటూ ఉష చెవుల రింగులు గట్టిగా లాగింది ఆ ఆకారం.

సినిమా కెళ్ళిన అన్నగారు వచ్చాడులా వుంది. తలుపు చప్పుడైంది. వెంటనే ఆ నల్లటి ఆకారం చీకట్లో కలిసిపోయింది.

పిచ్చిమాలోకం! రింగులు బంగారువి అనగానే నమ్మేశాడు. దొంగల్లో కూడా ఇలాంటి దద్దమ్మలుంటారు కాబోలు. బంగారం గొలుసు పోకుండా కాపాడుకున్నందుకు తన ఆలోచనకు తనే మురిసిపోతూ వచ్చి తలుపుతీసి అన్నగార్ని చెడామడా చివాట్లు పెట్టింది.

—సుహాసిని